క్లుప్తంగా

ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్‌కు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణ, తదితరులు

గరుగుబిల్లి: ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ జి.శ్రీనివాసరావు విశాఖపట్నంలో రేడిసన్ హోటల్‌లో బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును అందుకున్న సందర్భంగా శనివారం తోటపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణతో పాటు కమిటీ మెంబర్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. బ్యాంక్ అభివృద్ధికి, ఖాతాదారులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టెంపుల్ డెవలప్‌మెంట్ సేవా ట్రస్ట్ ట్రస్టీలు డి.ధనుంజయరావు, డి.పారినాయుడు తదితరులున్నారు.

పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అరుణ

సీతంపేట: మండలంలో పింఛన్ల పంపిణీ చురుగ్గా జరుగుతోంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసుకుని పింఛన్ డబ్బులు అందిస్తున్నారు. టిటికుపాయిగూడలో కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు సర్పంచ్ నిమ్మక అరుణ శనివారం పింఛన్లు పంపిణీ చేశారు.

ట్రైసైకిల్ వితరణ



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందిస్తున్న జనసేన కార్యకర్తలు

భామిని: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ ఆర్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన కార్యకర్తలు రక్తదానం చేశారు. బత్తిలో ఓ దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేశారు.

అర్హతే ప్రామాణికం..



అంపిలి సచివాలయంలో అర్హులకు పింఛన్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: అర్హత ఉంటేచాలు సంక్షేమ లబ్ధి నేరుగా ఇంటి తలుపు తడుతుందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. అంపిలి గ్రామ సచివాలయం పరిధిలో కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులకు శనివారం వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్‌తో కలిసి పింఛన్ డబ్బులు అందజేశారు. అలాగే లుంబూరు, పనుకువలస, నవగాం గ్రామాల్లో సర్పంచులు తిర్లంగి ఉపేంద్రకుమార్, కోట మంజుభార్గవి, తొర్లపాటి నీరజ తదితరులు నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

మక్కువ: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని నగుళ్లుదబ్బగెడ్డ గ్రామంలో శనివారం పర్యటించిన డీఈ సోమేశ్వరరావు, ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ సింహాచలం, ఏపీవో ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. నిర్మాణాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. నిర్మాణాలు చేపడుతున్న వారికి నిర్మాణ దశల వారీగా బిల్లుల చెల్లింపు సకాలంలో చేయడం జరుగుతోందని, అవసరమైతే రుణాలు కూడా ఇవ్వడం జరుగుతోందని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులంతా నిర్మాణాలు పూర్తి చేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సాలూరు: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు అభివృద్ధి పనులను నాడు-నేడు పీఎంయూ అధికారి కె.జె.ప్రకాశరావు శనివారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సూరినాయుడు, ఎంఈవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పార్టీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు



సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు



కురుపాం: కురుపాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, తదితరులు

మహానేతా.. మనసాస్మరామి

- వాడవాడలా వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి
- నివాళులర్పించిన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పెన్నిదిగా.. సంక్షేమ సారథిగా.. అపర భగీరథుడిగా.. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా ప్రజలంతా ఆ మహానేతను మనసారా స్మరించుకుని నివాళులర్పించారు. ఆయన చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాలకొండ పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల పెన్నిదిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు సుపరిపాలన అందిస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకుంటున్నారన్నారు. అనంతరం సీతంపేటలో బస్టాండ్ వద్ద, గొయిది కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే కళావతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



కురుపాం: మొండెంఖల్ గిరిజన గ్రామంలో రాజన్నకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి అంజలి ఘటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు



పాలకొండ రూరల్: పాలకొండ-వీరఘట్టం రహదారిలో నవగాం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



పాలకొండ: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు



భామిని: కొరమ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.చిరంజీవులు, మండల అధ్యక్షుడు టి.సింహాచలం, తదితరులు



కొమరాడలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, తదితరులు



గరుగుబిల్లి: గరుగుబిల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు



గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న ఎంపీపీ కె.దీనమయ్య, పార్టీ నాయకులు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, తదితరులు



వీరఘట్టం: వీరఘట్టంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ దమలపాటి, పార్టీ నాయకులు

ఆదర్శ ఆదివాసీ గ్రామం నల్లరాయిగూడ

- శ్రీకాకుళం జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

భామిని: జిల్లాలో వివాద రహిత, ఫిర్యాదులు లేని గ్రామంగా నల్లరాయిగూడ గుర్తింపు తెచ్చుకొని అందరికీ ఆదర్శంగా నిలిచిందని శ్రీకాకుళం జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. భామిని మండలం నల్లరాయిగూడలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనులు అందరికీ ఆదర్శంగా నిలిచారని, గొడవలు లేకుండా ఇదే విధంగా కలసిమెలసి ముందుకు సాగాలని సూచించారు. విద్య, ఉపాధిలో నల్లరాయిగూడ ముందుందన్నారు. ప్రతీ గ్రామం నల్లరాయిగూడను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులే కలహాలతో కోర్టుల మెట్లు ఎక్కుతున్న ఈ రోజుల్లో పంచాయతీ పరిధిలోని గ్రామస్తులంతా ఎలాంటి వివాదాలు లేకుండా ఐక్యంగా ఉండటం గొప్ప విషయమన్నారు. తమ గ్రామానికి జిల్లా జడ్జి రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ న్యాయమూర్తికి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక గోయింతి, ఎంపీటీసీ పాలక ఉషారాణి, కొత్తూరు కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.మని, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్, సీఐ కె.మురళీధర్, ఏఎల్‌ఓ ఆర్.వి.శ్రీనివాసరావు, ఐటీడీఏ ఏపీఓ వై.రోసిరెడ్డి, తహసీల్దార్ ఎస్.అప్పారావు, ఎంపీడీఓ చంద్రరావు, ఎస్సై అమ్మనరావు, ఎంపీటీసీ కె.చంద్రశేఖర్, కె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



భామిని: జిల్లా జడ్జి మౌలానాను సన్మానిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

నవజాత శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సవర సరస్వతి అనే మహిళ శనివారం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తొలి కాన్పు కావడంతో పురిటి నొప్పులు వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురైంది. కాన్పు తర్వాత పాపలో కదలిక లేకపోవడాన్ని వైద్యులు గుర్తించారు. అంతేకాక పాప నీలిరంగులో మారడంతో అంతా ఆందోళన చెందారు. పాప పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో నవజాత శిశువు అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని పాప పరిస్థితిని 108 కాల్‌సెంటర్ డాక్టర్ శ్రీకాంత్‌కు వివరించారు. ఆయన సూచనలతో అంబులెన్స్‌లో బేబీని ఎక్కించి కృత్రిమ శ్వాసను అందించి శ్రీకాకుళం పయనమయ్యారు. మార్గమధ్యలో కొల్లివలస వద్దకు వచ్చేసరికి పాపలో కదలికలు వచ్చి ఏడవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌లోని చిన్నపిల్లల ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. పాపకు కృత్రిమ శ్వాస అందించి ప్రాణాలు కాపాడిన అంబులెన్స్ సిబ్బంది గణపతి, మురళీలను తల్లిదండ్రులు, సీతంపేట ఆస్పత్రి వైద్యులు, రిమ్స్ వైద్యులు అభినందించారు.



పాపకు కృత్రిమ శ్వాస అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

108 సిబ్బంది రక్తదానం

పాలకొండ రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా 108 సిబ్బంది నేతృత్వంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు, 108 ఎంప్లాయిస్ అసోసియేషన్ వైఎస్సార్ టీయూసీ పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దివంగత వైఎస్సార్ మానస పుత్రిక అయిన 108 సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ జె.రవీంద్రకుమార్, 108 అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ, గిరి గణపతి, కార్యదర్శి రవిబాబు, రాము, కాంబాబు, తేజ, తదితరులున్నారు.



ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న 108 సిబ్బంది

అటవీ పరిరక్షణ అందరి బాధ్యత

- సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

భామిని: పర్యావరణాన్ని కాపాడే అడవిని అందరం కాపాడుకుందామని, పచ్చదనాన్ని పెంపొందించుకుందామని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. మండలంలోని దోకులగూడలో వెలుగు అసోసియేషన్ కార్యదర్శి బి.సంజీవరావు ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. గిరిజనులు ఆది నుంచి అడవిని నమ్ముకొని జీవించేవారు. కొండపోడు సాగులో భాగంగా కొంతమంది చెట్లు నరికివేయడం, వాణిజ్య పంటలను సాగు చేస్తుండడంతో అడవుల్లో చెట్లు తగ్గిపోతున్నాయని వివరించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవడం ద్వారా అటవీ విస్తీర్ణం పెరుగుతుందని, పర్యావరణం పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారిపోతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలాపు అప్పారావు, సర్పంచ్ బిడ్డిక గొయింతి, వెలుగు ప్రతినిధులు, ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.



కొండపోడులో మొక్కలు నాటుతున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

గిరిశిఖర గ్రామాల్లో వైద్య సేవలు



వైద్య సేవలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న డీఐఓ టి.జగన్మోహనరావు

కొమరాడ: గిరిశిఖర గ్రామాల్లో వైద్య శిబరాలు నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని చోళ్లపధం పంచాయతీ గిరిశిఖర గ్రామమైన రెబ్బలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సినేషన్ సేవలపై ఆరా తీశారు. గ్రామంలో ఎంతమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు, వారికి సక్రమంగా వైద్య సేవలు, పౌష్టికాహారం అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గిరిశిఖర గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవిధమైన అనారోగ్య లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని, మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి శ్యామల్‌జాన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాంబాబు మాస్టారుకు అభినందనల వెల్లువ

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస పాఠశాల ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబుకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం ఆయన్ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ అవార్డులు అందుకోవాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన మాస్టారుకు అవార్డు రావడంతో చిట్టపులివలస పాఠశాలలో పండగ వాతావరణ నెలకొంది. విద్యార్థులంతా కేక్ తెప్పించే రాంబాబు మాస్టారుతో కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. అలాగే గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి రాష్ట్ర స్థాయి అవార్డు రావడంతో శ్రీకాకుళం గురజాడ విద్యాసంస్థల అధినేత గుంట్రెడ్డి స్వామినాయుడు రాంబాబు మాస్టారుకు ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు.



రాంబాబు మాస్టారుతో చిట్టపులివలస పాఠశాల విద్యార్థులు